నీటి సంఘాలు కొలువుదీరేనా?

- ఆక్రమణకు గురవుతున్న భూములు
- 16 ఏళ్లయినా జరగని ఎన్నికలు
- చెరువు, కుంటలపై పర్యవేక్షణ కరువు
- ప్రతి ఏటా తగ్గుతున్న నీటి నిల్వలు
- పట్టించుకోని పాలకులు, ప్రభుత్వం

ఎర్రవల్లిచౌరస్తా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెరువులలో నీటి నిల్వలను పెంచి అభివృద్ధి చేయడం కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా గతంలో మిషన్ కాకతీయ పనులను చేపట్టింది. కానీ చెరువులు, కుంటల అభివృద్ధి, వాటి నిర్వహణ, ఆయకట్టుకు నీటిని సరఫరా చేయడం, పర్యవేక్షణ కోసం ప్రభుత్వం నీటి సంఘాలకు ఎన్నికలను నిర్వహించడం మాత్రం మర్చిపోయింది. దీనివల్ల ప్రస్తుతం చెరువులు, కుంటల పరిరక్షణ ఎంతో కరువైంది. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా ప్రభుత్వం గ్రామాల్లోని చెరువులను, కుంటలను శుభ్రం చేసి పునరుద్ధరించింది. నీటి సంఘాలకు, పాలక వర్గాలు లేకపోవడంతో చెరువు భూములు ఆక్రమణకు గురైనా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఇప్పటికే నియోజకవర్గంలోని చాలా చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయని ఆయా మండలాల ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో చెరువులపై పర్యవేక్షణ..

ప్రభుత్వం సాగునీటి సంఘాలకు నోటిఫికేషన్ విడుదల చేయగానే వంద ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువుల ఆయకట్టు రైతులు చైర్మన్‌తో పాటు డైరెక్టర్లను ఎన్నుకునేవారు. ఎన్నిక కాబడిన పాలకవర్గ సభ్యులు చెరువులు, కుంటల నిర్వహణతో పాటు నీటిని పంట పొలాలకు విడుదల చేసుకోవడంతో పాటు నీటిని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకునేవారు. రైతులను ఎప్పటికప్పుడు సమన్వయపర్చుకుంటూ వివిధ అభివృద్ధి పనులు నిర్వహించేవారు. దాదాపు 16 ఏళ్లయినా ప్రభుత్వం నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఆక్రమణకు గురవుతూ, చెరువులు, కుంటల నిర్వహణ ఎటుపోతుందో అర్థం కావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.


తిమ్మాపురంలో సేరి పెద్ద చెరువు


కోతకు గురై నీరు లేక ఎండిపోయిన ఇటిక్యాల లింగమ్మ చెరువు

2008 నుంచి ఎన్నికల జాడేలేదు..

అలంపూర్ నియోజకవర్గంలో వందఎకరాల ఆయకట్టు, అంతకంటే తక్కువ ఆయకట్టు ఉన్న చెరువులు, కుంటలు మొత్తం 114 ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2006లో రాష్ట్ర వ్యాప్తంగా వంద ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువులకు సాగునీటి సంఘాలకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎన్నికలను నిర్వహించారు. వాటి పదవీ కాలం కేవలం రెండేళ్ల మాత్రమే ఉండటంతో 2008లోనే ముగిసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వాలు మారినా సాగునీటి సంఘాలకు తిరిగి ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు లేవు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడి పదేళ్లయినా నీటి సంఘాల ఎన్నికల మాట ఊసెత్తలేదు. ప్రభుత్వం ప్రతి చెరువులో కూడా మిషన్ కాకతీయ పనులను చేపట్టింది. నీటి సంఘాలు లేకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను తూతూ మంత్రంగా చేసి చేతులు ఎత్తేశారు. దీనివల్ల పలు చెరువులు, కుంటలు వర్షాకాలంలో కోతకు గురై నీరు పూర్తిగా బయటికెళ్లింది. దీనివల్ల ఆయకట్టు రైతులు పంటలు ఎండిపోయి ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికై నా నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం చెరువులు, కుంటల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి వాటిని మరింత అభివృద్ధి చేయాలని ఆయా మండలాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

మండలాల వారీగా చెరువు, కుంటల వివరాలు

మండలం	జీపీలు	చెరువులు, కుంటలు
ఇటిక్యాల	29	44
మానవపాడు	16	06
ఉండవెల్లి	16	03
అలంపూర్	14	08
రాజోళి	11	04
వడ్డేపల్లి	10	05
అయిజ	28	44

నీటి సంఘాలతోనే చెరువుల అభివృద్ధి



నీటి సంఘాలను ఎన్నుకోవడం వల్లే చెరువులు అధికంగా అభివృద్ధి చెందుతాయి. గతంలో నీటి సంఘాలు ఉండటం వల్ల నీటిని పొదుపుగా వాడుకోవడమే కాకుండా వారి పర్యవేక్షణ కూడా పకడ్బందీగా ఉండేది. ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులను అభివృద్ధి చేసింది. కానీ కాంట్రాక్టర్లు చెరువులలోని పూడిక పనులను మాత్రం సక్రమంగా చేయలేదు. చెరువులో పనులు జరిగేటప్పుడు నీటి సంఘాలు ఉంటే పనులు సక్రమంగా జరిగేవి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చెరువులను అభివృద్ధి చేయాలి.

– కుర్వ ఆశన్న, రైతు, కారుపాకుల

ప్రభుత్వ ఆదేశాలు వస్తే ఎన్నికలు నిర్వహిస్తాం..



వంద ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువులకు నీటి సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే తప్పకుండా నోటిఫికేషన్ జారీ చేసి నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తాం. గతంలో చెరువుల అభివృద్ధి పనులు నీటి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు చూసుకునేవారు. ప్రస్తుతం నీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో ఎన్నికల ప్రక్రియను చేపట్టడం లేదు. చెరువులో ఉన్న ఆయకట్టు రైతులు చెరువులను ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– నరేందర్, తహసీల్దార్, ఇటిక్యాల

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: 132 కేవీ గద్వాల విద్యుత్ ఉపకేంద్రం అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఆయిల్ సీడ్‌ఫీడర్ సీటి మార్చేందుకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు మండలంలోని బీరెల్లి, వీరాపురం, పూడురు, బీచుపల్లి సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని డ్యాం రోడ్డులోని 33కేవీ విద్యుత్ ఉపకేంద్రం నుంచి, 11కేవీ కొత్తపల్లి 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నుంచి, 11కేవీ కొత్తపల్లి ఫీడర్ వరకు చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. మధ్యాహ్నం 3:30 నుంచి 5:30గంటల వరకు 11కేవీ కొత్తపల్లి ఫీడర్‌పై ఎల్‌సీ తీసుకోని, గద్వాల రూరల్, కొత్తపల్లి, గుంటిపల్లి గ్రామాలకు విద్యుత్ సరాఫరాను నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు.

చీరలు, మజ్జిగ వితరణ



గద్వాల అర్బన్: ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో వెంకంపేటలో ఆ సంస్థ అధ్యక్షుడు గిరిబాబు వృద్ధులకు చీరలు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యుడు వినయ్, ఓఎంఎఫ్ ఫౌండేషన్ సభ్యులు ప్రమీల, అంజనమ్మ, అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

రామాపురంలో కబడ్డీ టోర్నమెంట్

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో ఈనెల 22 నుంచి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఉభయ లింగేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న ఉభయలింగేశ్వరస్వామి, వివిధ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకుని కబడ్డీ, భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22న రాత్రి 7 గంటలకు భజన పోటీలు, 22 నుంచి 23 వరకు కబడ్డీ టోర్నమెంట్ ఉంటుందని, విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని వివేకానంద విగ్రహం పక్కన వేసవి సందర్భంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఎంపీఓ పద్మావతి గురువారం ప్రారంభించారు. వాహనదారులు, ప్రజలు, వేరే గ్రామాలకు చెందిన ప్రజలకు చలివేంద్రం చాలా ఉపయోగకరమని, ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, కార్మికులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

మానవపాడులో..



మానవపాడు: మండల కేంద్రంలో వేసవి సందర్భంగా పంచాయతీ కార్యదర్శి దర్శలి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారని, వారు ఇబ్బందులు పడకుండా చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, మద్దిలేటి, శిరాముడు, మద్దిలేటి, ఫీల్డ్‌అసిస్టెంట్ వెంకటేష్, రాముడు, దుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

'డ్రెయినేజీ పనులు పూర్తి చేయండి'



అయిజ: పట్టణంలో ఏర్పాటు చేసిన డ్రెయినేజీ నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతేడాది పెట్రోల్ బంక్ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ వరకు సీసీ డ్రెయినేజీ పనులు చేపట్టారు. అక్కడక్కడ డ్రైనేజీ నిర్మాణం నిలిచిపోయింది. కొత్త బస్టాండ్‌లో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం వరకు డ్రెయినేజీ నిర్మాణం పూర్తి చేశారు. వాగు వరకు డ్రెయినేజీ నిర్మాణం చేపట్టకుండా మధ్యలో నిలిపేయడంతో మురుగు అక్కడే నిలిచిపోతుందని, దానివల్ల దుర్వాసన వెదజల్లుతుందని కొత్తబస్టాండ్ కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి డ్రెయినేజీ నిర్మాణం పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై మహిళల నిరసన

గద్వాల: డ్రెయినేజీ నీరు ఇళ్లలోకి చేరుతుందంటూ 9వ వార్డుకు చెందిన మహిళలు నిరసన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక రాఘవేంద్రకాలనీ సమీపంలోని ప్రధాన రోడ్డుపై మహిళలు నిరసన తెలిపి మున్సిపల్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొంతమంది వ్యక్తులు స్థలాలను ఆక్రమించుకుని మురుగు పారుదలకు అడ్డంకులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. స్థలాల ఆక్రమణ వల్ల మురుగు సమీపంలోని ఇళ్లలోకి చేరుతోందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం కమిషనర్ శంకర్‌సింగ్ సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు శాంతించి ఆందోళన విరమించారు.

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరంగా చేపట్టారు. గురువారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టును ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు పోలీసుల ఆధ్వర్యంలోని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి మద్యం, లిక్కర్, డబ్బు రాకుండా అధికారులు గట్టి బందోబస్తుతో తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి, ఏఎస్‌టీం, సిబ్బంది ఉన్నారు.

కనుల పండువగా రథోత్సవం


రథోత్సవంలో సీతారాముల వేషధారణలో చిన్నారులు


ఉండవెల్లిలో రాములవారి చివరి ఘట్టంలో పాల్గొన్న అర్చకులు

ఉండవెల్లి: శ్రీరామనవమి సందర్భంగా మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం ఆరు రోజులుగా నిర్వహిస్తున్నారు. గురువారం స్వామి వారికి సంక్షిప్త రామాయణ హవనం, మహాపూర్ణహుతి, కుంభ ప్రోక్షణ, శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం, మంగళ శాసనం, పండిత సన్మానం, వేద ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తి గీతాలు, ప్రత్యేక భజనలు, కోలాటం వేస్తూ వీధుల్లో ఊరేగించారు. మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయం నుంచి కోట అంజనేయస్వామి ఆలయం వరకు రథాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దామోదర్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, మహిళలు, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి పట్టాభిషేకం..

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండ రామస్వామి ఆలయంలో గురువారం సీతారాముల పట్టాభిషేకం అర్చకులు వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీమాన్ సుదర్శన్ నారాయన్ ఆధ్వర్యంలో శిష్య బృందం ఐదోరోజు ఆలయంలో పలు ప్రత్యేక పూజలు చేశారు. సామ్రాజ్య పట్టాభిషేకం, హోమం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు, అర్చకులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.


కోలాటం వేస్తున్న చిన్నారులు


బీచుపల్లిలో రాములోరికి పట్టాభిషేకం

శ్రీరామనవమి సందర్భంగా క్రీడాపోటీలు

మానవపాడు: మండల కేంద్రంలోని పెద్దపోతులపాడులో శ్రీరామనవమి సందర్భంగా గురువారం క్రీడాపోటీలు నిర్వహించారు. రన్నింగ్, స్లో బైక్‌రైస్, గ్రామానికి సంబంధించి పొట్టేళ్ల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, భాస్కర్, వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు, నాయకులు పాల్గొన్నారు.


పెద్దపోతులపాడులో పరుగు పోటీలో పాల్గొన్న యువకులు

ఉత్సాహంగా ఎద్దులబండి గిరక పోటీలు


ఎద్దులబండి గిరక పోటీలను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

అయిజ: శ్రీరామనవమిని పురస్కరించుకొని మండలంలోని ఈడుగోనిపల్లిలో గురువారం గ్రామస్తులు ఎద్దులబండి గిరక పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొత్తం 10జతల ఎడ్లు పాల్గొన్నాయి. బోయ గంగన్న ఎడ్లు మొదటి బహుమతి రూ.6వేలు కైవసం చేసుకున్నాయి. కోడిపుంజు తిమ్మప్ప ఎడ్లు రెండో బహుమతి రూ.5వేలు గెలుచుకున్నాయి. బోయ చిన్నయ్య ఎడ్లు మూడో బహుమతి రూ.4వేలు గెలుచుకున్నాయి. బుడెన్‌సాబ్ ఎడ్లు నాల్గవ బహుమతి రూ. 3వేలు కైవసం చేసుకున్నాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బడేసాబ్, చిన్న సోమన్న, లింగం సోమన్న, తిమ్మప్ప, మల్దకల్, పెద్ద వెంకట్రాములు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బట్లదిన్నెలో శ్రీరామనవమిని పురస్కరించుకొని గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎడ్ల బండ్ల గిరక పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సత్యారెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 12జతల ఎడ్లు పాల్గొన్నాయి. పోటాపోటీగా గిరక బండ్లను లాగాయి. మొదటి బహుమతిని కుచినెర్ల రాముడు ఎడ్లు రూ. 20వేలు దక్కించుకోగా, రెండో బహుమతి మన్నాపురం రహీమ్ ఎడ్లు రూ.15వేలు దక్కించుకున్నాయి. మూడో బహుమతి చిన్న హనుమంతు ఎడ్లు రూ.10వేలు, నాల్గవ బహుమతిని గట్టుకు చెందిన ఆంజనేయులు, ఇటిక్యాలకు చెందిన రూబెన్ ఎడ్లు రూ. 5వేలు కైవసం చేసుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులను రైతు సంఘం నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నారాయణ, వెంకటేష్‌గౌడ్, లూథర్, వెంకట్రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వాసుగౌడ్, మద్దిలేటిగౌడ్, ప్రసాద్, రైతు సంఘం నాయకులు, తదితరులు ఉన్నారు.


బట్లదిన్నెలో గిరక బడి పోటీలు ప్రారంభిస్తున్న నాయకుడు సత్యారెడ్డి

విద్యాభివృద్ధికి ఎంతో కృషి

గట్టు: మండల విద్యాధికారి కొండారెడ్డి గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు విద్యనందించడంలో ఎంతో కృషి చేశారని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమంలో కొండారెడ్డి దంపతులను పీఆర్‌టీయూ నాయకులు, మండల పరిధిలోని ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, రంగన్న, వెంకటేష్, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్పీ భారీ మూల్యం చెల్లించుకోవాలి

ఎర్రవల్లిచౌరస్తా: బీఎస్పీ అధినేత్రి మాయావతిపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పదేపదే అనవసరంగా మాట్లాడితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు హెచ్చరించారు. గురువారం ఇటిక్యాల మండలంలోని శివనంపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు ముందు మాయావతి పొత్తుకు సంపూర్ణ మద్దతు తెలిపిందన్నారు. కానీ కవిత అరెస్టు తర్వాత పార్టీకి, ఆర్ఎస్పీకి చెడ్డపేరు వస్తుందని సూచించి పొత్తుకు నిరాకరించిందన్నారు. దీనిని మనసులో పెట్టుకొని మాయావతిపై అకారణంగా బురద చల్లడం మానుకోవాలన్నారు. ఆర్ఎస్పీ భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మాయావతి నాయకత్వాన్ని బలపరుస్తూ బీఎస్పీ అభ్యర్థికి తమ పూర్తి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.


శివనంపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న రాంబాబు

తాగునీటి ఎద్దడిని పరిష్కరిస్తాం

ఆత్మకూర్: వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి, మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుజాత, తహసీల్దార్ రాజు, ఏఓ వినయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రామకృష్ణ, రుక్మేందర్‌రెడ్డి, గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి అవసరాలను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టే విధంగా ముందుకెళ్లాలని సూచించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద కర్నూల్ శివారు నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి సమయంలో జాతీయ రహదారిపై కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా, పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. టిప్పర్ డ్రైవర్ నరసింహాపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. టిప్పర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రాజకీయపార్టీ నాయకులతో సమావేశం



అలంపూర్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గురువారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్డీఓ రామచందర్ హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా అలంపూర్ అసెంబ్లీ–80 స్థానంలోని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మంజుల, ఆర్ఐ కరీం, రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు.

నీటి ట్యాంకులకు మరమ్మతు చేయండి

రాజోళి: ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన నీటి ట్యాంకులు మరమ్మతులు లేక నోర్లెళ్లబెడుతున్నాయి. గ్రామంలో ఉన్న పాడి పశువులకు తాగు నీరందించేందుకు నిర్మించిన నీటి తొట్టిలతో పాటు, స్థానికుల అవసరాల కోసం వాడుకునే నీరు కూడా ఆ ట్యాంకుల్లోనే నింపుతున్నారు. కాని వాటికి మరమ్మతు కూడా చేయకపోవడంతో ట్యాంకుల నుంచి నీరు లీకవుతోంది. ట్యాంకుల పక్కనే నిర్మించిన నీటి తొట్టిలు సైతం శిథిలావస్థకు చేరడంతో రైతులు పశువులకు నీరు అందించేందుకు ఉన్న వనరులు కోల్పోతున్నారు. వాటికి కనీసం మరమ్మతులు చేయడం లేదని ఆవేదన చెందుతున్నారు. నూతన ట్యాంకులు నిర్మించకపోయినా, ఉన్న ట్యాంకులకు మరమ్మతులు చేయాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉందని ప్రజలు పేర్కొన్నారు.


రాజోళిలోని వీవర్స్ కాలనీలో మరమ్మతుకు నోచుకోని ట్యాంకు


అయిజ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఎండలో నిలుచున్న ప్రయాణికులు

బస్టాండ్ ఆవరణలో.. ప్రయాణికులకు నీడ కరువు

అయిజ: మండుతున్న ఎండల్లో ప్రయాణం చేసేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణానికి ప్రతిరోజు గద్వాల, రాయచూరు, కర్నూలు డిపోల నుంచి బస్‌లు వస్తుండడంతో ప్రయాణికుల సంఖ్య ఘననీయంగా ఉంటోంది. ప్రయాణ ప్రాంగణ భవనం చిన్నగా ఉండడంతో ఆర్టీసీ మైదానంలో ప్రయాణికులు మండుటెండలో నిలబడాల్సి వస్తోంది. ఆర్టీసీ శాఖకు ప్రయాణికుల నుంచి ఆదాయం అధిక మొత్తంలో వస్తున్నా, కనీసం నీడకోసం పందిరి కూడా వేయకపోవడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.